ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ చేయాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంట సాగుకు అవసరమైన యూరియా పక్కదారి పట్టకుండా ప్రణాళికాబద్ధంగా రైతులకు పంపిణీ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న యూరియాను వ్యవసాయ సాగుకు అవసరం మేరకు ప్రణాళికాబద్ధంగా రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున యూరియా వాడకం పెరిగిందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలను ఈ నెలాఖరు వరకు మేరకు పొదుపుగా రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. అధికారులు డీలర్ల షాపుల్లో నిల్వలను తనిఖీ చేయాలని ఆదే శించారు. కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 2,692 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా అక్ర మరవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



పి శ్రీనివాస్

నెన్నెల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నెన్నెల తహసీల్దార్‌గా పి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో సుపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. నాయబ్ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ సులోచన, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మండల రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో ఇక్కడి తహసీల్దార్ జ్యోతి ప్రియదర్శిని గుండెపోటుతో మృతి చెందగా, ఇన్నాళ్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నెన్నెల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలకు తక్షణమే పరిష్కరించేందుకు ఈ నెల 20న నెన్నెల రైతు వేదికలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని బెల్లంపల్లి డీఈఈ బి రాజన్న, రూరల్ ఏడీఈ రవికుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ పాల్గొంటారని చెప్పారు. నెన్నెల, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల విద్యుత్ వినియో గదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరఫరాలో అంతరాయం, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ జారీలో ఆలస్యం, మీటరు, సర్వీసు లోపాలు, రీ కనెక్షన్ సమస్య లు, కనెక్షన్ మార్పు, బిల్లింగ్‌లో తప్పులు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ముంపు ముంగిట ఎంసీహెచ్

మత్తడి దూకుతున్న తిలక్‌నగర్ చెరువు





మాతాశిశు ఆసుపత్రి వద్ద నిలిచిన నీరు

- ఎల్లంపల్లి గేట్లు తెరవడంతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి
- ఆసుపత్రి భవనం చుట్టూ చేరిన వరద నీరు
- రోగులను జీజీహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది



నీట మునిగిన జిల్లా కేంద్రంలోని సూర్యనగర్



బెల్లంపల్లిలో రైల్వే కాలనీ వద్ద నిలిచిన వరద నీరు



బెల్లంపల్లిలో రాంనగర్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న నీరు

మంచిర్యాల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గోదావరి సమీపంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)కు వరద ముప్పు పొంచి ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 గేట్లను తెరిచి రెండు లక్షల పైచిలుకు క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువన గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. దీంతో గోదావరి ఉగ్రరూపం దాల్చగా ఎంసీహెచ్ భవనం చుట్టూ నీరు చేరింది. దీంతో అక్కడ చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణులు బిక్కుబిక్కుమని గడుపుతుండగా వారి కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2022 జూలై 13న కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగి మాతా శిశు ఆసుపత్రి మొదటి అంతస్తు వరకు నీటిలో మునిగి పోయింది. దీంతో అప్పటి వరకు అక్కడ చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణులను అర్ధరాత్రి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసు పత్రికి తరలించారు. ప్రస్తుతం మళ్లీ గోదావరి ఉగ్ర రూపం దాల్చడంతో అదేసీను రిపీట్ అవుతుందేమోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

● ప్రతి ఏటా ఇదే తంతు..

ఎంసీహెచ్ భవనం గోదావరి నదికి సమీపంలో ఉండడంతో ప్రతిఏటా నది ఉప్పొంగినప్పుడల్లా ఆసుపత్రి ముంపునకు గురికావాల్సి వస్తుంది. ప్రతి ఏటా ముంపునకు గురికావడం, అందులో చికిత్స పొందుతున్న రోగులను తరలించడం కొన్నాళ్లుగా ఆనవాయితీగా వస్తోంది.

● స్థల మార్పిడితోనే సమస్యకు పరిష్కారం..

గోదావరి సమీపంలో ఎన్‌సీహెచ్ భవనం నిర్మించడమే క్షమించరాని నేరంగా ప్రజలు భావిస్తున్నారు. ఆ స్థలంలో గతంలో కలెక్టరేట్ భవనం నిర్మించాలని ప్రతిపాదన వచ్చింది. అప్పుడు సాయిల్ టెస్ట్ చేసిన ఆర్అండ్‌బీ అధికారులు ముంపు ప్రాంతం కావడంతో కలెక్టరేట్ భవనానికి పనికిరాదని తేల్చిచెప్పారు. అయితే కాలక్రమంలో అదే స్థలాన్ని ఎంసీహెచ్‌కు కేటాయించడంపై భిన్నస్వరాలు వినిపించాయి. కలెక్టరేట్ భవనానికి పనికిరాని స్థలం మాతాశిశు ఆసుపత్రికి ఎలా ఎంపిక చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. దీనికి తోడు ప్రతి ఏటా ఆసుపత్రి భవనం తరుచుగా ముంపునకు గురవుతుండడంతో స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చొరవ మేరకు దానిని ఐబీ సమీపంలో నిర్మాణంలో ఉంది. ప్రస్తుత నిర్ణయమే సరైనదని, స్థల మార్పిడితోనే ఎంసీహెచ్ ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే ప్రత్యేకచొరవతో ఆసుపత్రి భవనానికి అవసరమైన నిధులు రూ.350కోట్లు (సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రినిర్మాణాన్ని కలుపుకొని) నిధులు మంజూరు కూడా అయ్యాయి. దీంతో ఆసుపత్రి నిర్మాణం వేగం పుంజుకుంది. 2027సంవత్సరంలో ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. ఆసుపత్రి నిర్మాణం త్వరగా జరిగి వైద్య చికిత్స ప్రారంభిస్తే వరద ముంపు నుంచి రోగులకు ఉపశమనం లభించే అవకాశం ఉంది.

● జిల్లా కేంద్రంలో నీట మునిగిన కాలనీలు

మంచిర్యాలక్రైం/మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో భారీ వర్షాలు కురువడంతో పలు కాలనీలు జలదిగ్బంధం అయ్యాయి. సూర్యనగర్, బృందావన్‌కాలనీ, హమాలీవాడ, అశోక్ రోడ్డు, హైటెక్‌సిటీ,

-మిగతా 7లో



నస్పూర్‌లోని తోళ్లవాగు కల్వర్టుపైనుంచి పారుతున్న వరద



సీతారాంపల్లి రోడ్డులో ఒర్రె నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న గేదె

గంజాయి రవాణాపై నిఘా 6

● పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో దాడులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి, పశునష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం మండలంలోని బోయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ, మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి, నర్సాపూర్‌లోని చెక్‌డ్యామ్‌ల వద్ద పరిస్థితులను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేస్తామన్నారు. వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించే సమయంలో వాహనదారులు వెళ్లవద్దని సూచించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్షణ సహాయం కోసం కంట్రోల్ రూమ్ 08736-250501కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి



వేమనపల్లిలో ఫెర్టిలైజర్ షాపులో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏడీఏ సురేఖ

వేమనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పంటలకు సరిపడ యూరియాను అందించాలని ఏడీఏ సురేఖ సూచించారు. సోమవారం వేమనపల్లిలో ఫెర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను అందించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అలాగే రైతులందరు ఏఈవోల వద్ద ఆధార్‌కార్డు, సెల్ ఫోన్‌తో వెళ్లి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రుక్సార్ సుల్తానా, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ



శిక్షణ కానిస్టేబుళ్లతో బెటాలియన్ కమాండెంట్ రాములు

హాజీపూర్, ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుడిపేట 13వ బెటాలియన్‌లో ఆర్టీసీ కానిస్టేబుళ్ల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. బెటాలియన్ కమాండెంట్ శిక్షణతరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఆర్టీసీ కాని స్టేబుళ్ల క్రమశిక్షణతో ఉద్యోగం చేస్తూ సంస్థకు మంచి పేరు తీసుకరావాలని అన్నారు. శిక్షణ తరగతుల్లో 51మంది కానిస్టేబుళ్లకు శారీరక దారుఢ్యం, సబ్జెక్టుపై శిక్షణ ఇవ్వనున్నారు.

గురుకులాల్లో మెరుగైన విద్యను అందించాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి వెంకటయ్య



రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు పూలబొకే అందజేస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాల్లో మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి వెంకటయ్య సూచించారు. సోమవారం కార్మిక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌చైర్మన్ మాట్లాడుతూ బాలికలహాస్టల్ ప్రహరీ సోలార్ ఫెన్సింగ్ అమర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీగురుకుల విద్యాసంస్థలకు త్వరలోనే భవనాల నిర్మాణానికి నిధులు విడుదల అయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు రాబట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించడంతో పాటు మెరుగైన విద్యను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మనోజ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, నీలాదేవి, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గ ప్రసాద్, ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ క్రిష్ణ పాల్గొన్నారు.

● వినాయక మండపం ఏర్పాటుకు ఇబ్బందులు కలిగించొద్దు...

పట్టణంలోని బూడిదగడ్డ భక్తులు ఏర్పాటు చేసుకుంటున్న వినాయక మండపానికి అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని ఎస్సీ ఎస్టీ కమిషన్ వెంకటయ్య సూచించారు. ఇటీవల రెవెన్యూ అధికారులు కూల్చిన వినాయక మండపాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వస్థలంలో ఏర్పాటు చేసుకున్న వినాయక మండపాన్ని భవిష్యత్‌లో ప్రభుత్వానికి అవసరం నిమిత్తం ఉపయోగించుకోవచ్చునన్నారు. వినాయక మండపం కూల్చివేతపై బస్తీలోని దళితులందరూ వినతిపత్రం అందజేయాలని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బస్తీ వాసులు అందజేశారు.

బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన మహనీయుడు పాపన్నగౌడ్



పాపన్నగౌడ్ చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బహుజనుల రాజ్యాధికారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీడితులు ఏకమై ఎదురు తిరిగితే రాజ్యాధికారం సాధించవచ్చని ప్రజలను చైతన్యపర్చిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. భావితరాలకు తెలిసే విధంగా మహనీయుల జయంతి , వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, నాయకులు గాజుల ముకేష్ గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నస్పూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారి రవూఫ్ ఖాన్‌కు అందించారు. అంతకు ముందు ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చి ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు రాష్ట్ర నాయకుడు ప్రసాద్, జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఫేస్ క్యాప్చర్, జీపీఎస్‌యాప్, అన్‌లైన్‌యాప్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు భానుమతి, రాజమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, సంకె రవి, నాయకులు విరోనిక, శారద, విజయలక్ష్మి, సరిత, సబితా, ప్రవీణ, పద్మవతి, అనురాధ, స్వాతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ ఐ నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనికాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జీబుజాతను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండడంతో పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు విద్యను అందించడం లేదన్నారు. రాష్ట్రంలో ఎనిమిదివేల కోట్లకుపైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. అంతకుముందు పట్టణంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి అభినవ్, నాయకులు నిఖిల్, సాయికిరణ్, రాంచరణ్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్

నెన్నెల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలో వర్షాలతో దెబ్బతిన్న పత్తి చేలు, వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలిచారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కుండపోత వర్షంతో పత్తి చేలు కొట్టుకుపోయాయని, వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంట నష్టం అంచనా వేయాలని కోరారు. పరిహారం అందించడంలో ఆలస్యం చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, నాయకులు, శ్యామ్, రవి, కార్తీక్, శంకర్, సత్యం ఉన్నారు.

పంటపొలాల పరిశీలన

నెన్నెల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను సోమవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. నెన్నెల, మన్నెగూడం, లంబాడితండా శివారులో నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు రైతులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నామని, బాధిత రైతులకు ప్రభుత్వం సాయం తప్పకుండా అందుతుందని మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం సర్వే చేస్తున్నారని చెప్పారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు చిరంజీవి, వెంకటేష్, సంతోష్, రాజేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వరద నీటిని పరిశీలించిన ఎంపీడీవో



తుర్కపల్లి వద్ద రోడ్డుడ్యాంపై ప్రవహిస్తున్న వరద పరిశీలిస్తున్న ఎంపీడీవో

మందమర్రిరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌పల్లి, చిర్రకుంట, పొన్నారం గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సారంగపల్లి నుంచి చిర్రకుంట వెళ్లే మార్గంలో ఉన్న తుర్కపల్లి రోడ్ డ్యాంపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. చిర్రకుంట, శంకర్‌పల్లి గ్రామాల్లోని పలువురు ఇండ్లలోకి నీరు చేరింది. వరద ఉధృతిని ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా అత్యవసరం అయితే అధికారులకు సమాచారం అందించాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ సూచించారు.

అనారోగ్యంతో జడ్పీ మాజీ వైస్‌చైర్‌పర్సన్ మృతి



ప్రవీణరెడ్డి(ఫైల్)

దండేపల్లి ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేదరిపేట గ్రామానికి చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ మర్రి ప్రవీణరెడ్డి అలియాస్ రెడ్డమ్మ (77) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సోమవారం మృతి చెం దారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ప్రవీణరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి టీడీపీ హయాంలో 2001లో దండేపల్లి జడ్పీటీసీగా గెలుపొంది, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జడ్పి వైస్ చైర్‌పర్సన్‌గా ఐదేళ్ల పాటు పనిచేశారు. అంతకంటే ముందు మూడు దశబ్దాల నుంచి మేదరిపేటలో మల్లిక నర్సింగ్ హోం క్లినిక్ ప్రారంభించి గర్భిణులకు పురుడుపోశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించారు. ప్రవీణరెడ్డి అంత్యక్రియలు ద్వారక గోదావరి నది ఒడ్డున ముగిశాయి.

రైలులో ప్రయాణిస్తున్న యువకుడు..

మంచిర్యాలక్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మీదుగా జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ధన్‌పత్‌లాల్ యాదవ్ (35) అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్‌పీ ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. ఛత్తీస్‌గఢ్‌లోని పత్రపార్టి గ్రామానికి చెందిన లాల్ యాదవ్ గ్రామసుడ్‌థలతో కలిసి తమిళనాడులో బోర్‌వెల్ వాహనంపై పనిచేసేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో అనారోగ్యానికి గురయ్యాడు. ఇంటికి తిరిగి వెళ్లేందుకు నెల్లూరు రైల్వే స్టేషన్ దిగి జైపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో బంధువు రాంప్రసాద్ యాదవ్ తీసుకొస్తుండగా మంచిర్యాల సమీపంలోకి రాగానే ధన్‌పత్‌లాల్ యాదవ్ మృతి చెందాడు. రైల్వే అధికారులకు సమాచారం అందించడతో మృతదేహాన్ని మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

చెన్నూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహంకాళి వాడలో మానిశెట్టి రమేష్ అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. ఎద్దుపై విద్యుత్ వైర్లు తెగి పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన..

పోక్సో కేసు నమోదు

కోటపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. కోటపల్లిలోని ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద హమాలీగా పనిచేస్తున్న కాల్వ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పోగుల సురేష్ అనే వ్యక్తి పాఠశాల విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి సురేష్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

తాండూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి నుంచి తాండూర్ వైపు వెళ్తున్న లారీ తాండూర్‌లోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి పప్పు దినుసులతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. పెట్రోల్ బంకు సమీపంలో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిరంతరంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్షాల వల్ల ఏ ప్రమాదం సంభవించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా పోలీసులను, అధికారులను, సిబ్బంది సిద్ధం చేశామని అన్నారు. వర్షాల వల్ల ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని, రహదారులపై గాని, ఇతర ప్రదేశాలలో గాని సమస్యలు తలెత్తిన వెంటనే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, వైద్య శాఖల అధికారుల సమన్వయం చేసుకుంటూ వర్షాల వల్ల కిగేల ప్రమాదాలపై తక్షణ స్పందన కలిగే విధంగా పోలీసు అధికారులను సిద్ధం చేశామన్నారు. వాగులు, చెరువులను ఆనుకొని ఉండే ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపర్లు వాగులు, వంకల వైపు వెళ్లరాదని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకునేందుకు గస్తీ పోలీసులను అప్రమత్తంగా ఉండేలా ఆదేశించామని తెలిపారు. విపత్కర సమస్య వస్తే లోకల్ పోలీసు అధికారులు లేదా డయల్ 100 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూం నెం. 8712670551కు సమాచారం అందించాలని తెలిపారు.

గంజాయి రవాణాపై నిఘా



- మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగించే రహదారులపై తనిఖీలు
- పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో దాడులు

కాగజ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గంజాయి దందాపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ దిశగా జిల్లాలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు గత కొన్ని నెలల నుంచి నిఘా తీవ్రం చేశారు. వాస్తవంగా ఈ దందా మహారాష్ట్ర కేంద్రంగా జిల్లాలో సరఫరా జరుగుతోంది. మహారాష్ట్ర నుంచి రైలు మార్గం ద్వారా, మహారాష్ట్ర నుంచి వాంకిడి మీదుగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. వీటితో పాటు సిర్పూర్(టి)-అంతరాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా కూడా కొంత మంది తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

అనార్థాలపై అవగాహన

గంజాయి తీసుకోవడం వల్ల తలెత్తే అనార్థాలపై జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ, జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. యువత పెడ తోవ పట్టకుండా ఉండేందుకు పక్కా ప్రణాళికలు వేస్తున్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో నవోదయ విద్యాలయంతో పాటు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల్లో వివిధ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. వాస్తవంగా గంజాయి వాడటం తాత్కాలిక ఆనందం వస్తుందే తప్పా, ఇది వాడటం వల్ల ఆరోగ్య నష్టం, డిప్రెషన్, ఆందోళన, క్రమేణా జ్ఞాపక శక్తి తగ్గి పోవటం, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, గుండెకు సంబంధించి వ్యాధులతో పాటు కీలకంగా సైకోసిస్, హల్యుసినేషన్లు, పానిక్ అటాక్స్ అధికంగా ఉంటున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇటీవల కాలంలో..

ఇటీవల కాలంలో జిల్లాలో పలు చోట్ల అధికారుల దాడుల్లో గంజాయి పట్టుబడింది. ఆగస్టు 12న ఆసిఫాబాద్ పంజాబీ దాబా వద్ద కూడా దాడులు నిర్వహించి 60 గ్రాముల గంజాను పట్టుకొని ఖైరిగాంకు చెందిన శ్రావణ్‌కుమార్, రాజుకు చెందిన అరుణ్ రామారావుపై కేసులు కూడా నమోదు చేశారు. ఆరు నెలల క్రితం చింతలమానేపల్లి మండలంలో టాస్క్‌ఫోర్సు అధికారులు గంజాయి రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసు చేశారు. అలాగే ఈసుగాంలో కూడా గంజాయి దందా చేస్తున్న వారిని అదుపులోకి ఇద్దరిపై కేసులు కూడా నమోదు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఆదేశాల మేరకు నిఘా ముమ్మరం చేశాం. అనుమా నిత ప్రాంతాల్లో నిత్యం తనిఖీలు చేపడుతున్నాం. యువత గంజాయి బారిన పడ కుండా అవ గాహన సదస్సులు నిర్వ హిస్తున్నాం. యువతపై కేసులు నమోదైతే ఇబ్బందులు పడుతారని తెలియజేస్తున్నాం.



టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్న గంజాయి(ఫైల్)

రేపు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి

జూపల్లి కృష్ణారావు రాక

ఆసిఫాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లాకు రానున్నట్లు అదనపు పీఎస్‌టు మినిస్టర్ కాసుల నానిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.40 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారని పేర్కొన్నారు. జిల్లాలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు, ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని తహసీ ల్దార్ రామ్మోహన్ అన్నారు. రెబ్బెన గ్రా మంలో సోమవారం రైతులు, కూలీలతో మాట్లాడారు. అత్యవసరమైతే తప్ప బయటికి ఎవరు రాకూడదని సూచించారు. భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండి వాతావరణ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. భారీ వర్షాలకు ప్రమాద భరితంగా ప్రవహిస్తున్న వాగులను దాటవద్దని చెప్పారు. వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదని సూచించారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన మీరా రాణి మండల్ తన పేరిట గల లావుని పట్టా భూమిని తన తమ్ముడు పట్టా చేసుకున్నందున విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. మిత్ర సర్వీసెస్ మేనేజింగ్ పార్టనర్ కొండగుర్ల చంద్రశేఖర్ అవుట్ సోర్సింగ్ పోస్టులను సమానంగా కేటాయించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందని రైతులు తమ గ్రామం గుండా నాలుగు వరుసల రహదారి పక్కన ఖాళీ స్థలాలను ఆక్రమించుకున్నందున వ్యవసాయ చేనులో వస్తున్న వరద నీరు పోకుండా ఆగిపోవడంతో పంట నష్టం జరుగుతుందని, చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన పెంటన్న తన తండ్రి వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ మరణించినందున వారసత్వం ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని దరఖాస్తు అందజేశాడు. ఆసిఫాబాద్ మండలం వెకంటాపూర్ గ్రామానికి చెందిన పుల్లయ్య సాలెగూడ శివారులో అక్రమంగా పట్టా చేసిన వాటిని రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు తన పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని పట్టా చేసి పాసు పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్‌కు చెందిన పురుషోత్తం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరద నీరు చేరకుండా చర్యలు



డ్రైనేజీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

రెబ్బెన, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా వరద నీరు నివాస ప్రాంతాలకు చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. రెబ్బెనలోని ఎస్టీఆర్ కాలనీ, రెబ్బెన మండలంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వర్షం నీరు ఇండ్లలోకి రాకుండా అన్నీ రకాల చర్యలు చేపడుతున్నామని అన్నారు. అలాగే క్లోరినేషన్ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్య ప్రకాష్, ఎంపీడీవో శంకరమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం ఎల్లారం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, భోజనం నాణ్యత, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం సకాలంలో అందించాలని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా ప్రత్యేక దృష్టి సారించి వారి తల్లితండ్రులతో ఉపాధ్యాయులు మాటాడాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట విద్యాశాఖాధికారి ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి పురస్కరించుకుని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుక లకు అదనపు కలెక్టర్ డేవిడ్, గౌడ సంఘం నాయకులు, వెనకబడిన తరగతుల సంఘాల నాయకులతో కలిసి హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, మొగలాయిల ఆగడాలను ఎదురించిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. సౌకర్యాలు లేని రోజుల్లో సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని బహుజనుల కోసం పోరా టాలు చేశారని తెలిపారు. ఇలాంటి మహనీయుల ఆశయ సాధనకు మనమందరం ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమానికి సమష్టిగా కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి జీవన్, పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, నాయకులు శ్యాంనాయక్, గౌడ సంఘం నాయకులు సుదర్శన్‌గౌడ్, రమేశ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు ఆదేశాల మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని నియమాక పత్రాలను అందజేసినట్లు జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా అరిగెల మల్లికార్జున్ యాదవ్, కోవ విజయ్‌కుమార్, రాపర్తి ధనుంజయ్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేందర్‌గౌడ్, మారుతి, రాణి, అన్నపూర్ణ, బానోత్ వెంకట్‌నాయక్, జిల్లా కార్యదర్శులుగా సోమేశ్వర్, నవీన్‌గౌడ్, సుబోద్, ఇందిర, రోజా, సమీర్‌గుప్తా, జిల్లా కోశాధికారిగా కిరణ్‌కుమార్, కార్యాలయ కార్యదర్శిగా సూర్యప్రకాష్, సోషల్ మీడియా ఇన్‌చార్జీగా సంతోష్, మీడియా కన్వీనర్‌గా సత్యనా రాయణ, ఐటి ఇన్‌చార్జీగా అమిత్ బిస్వాస్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యవర్గ సభ్యులు పార్టీ పటిష్ఠతకు పాటుపడాలని సూచించారు.

సీఐకి సేవా పతకం అందజేత

ఆసిఫాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసిన సీఐ పి రాజేంద్రప్రసాద్‌కు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీసు సేవా పతకం అందజేశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం సీఐ రాజేంద్రప్రసాద్ రామగుండం కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

జైపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకత సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా లోని ఇందారం ఉపరితల గని, ఐకే 1ఏ గనిలో మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా మల్టీ డిపార్టుమెంటల్ సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశ్యం ఉద్యోగులందరికి సంస్థకు సంబంధించిన ప్రతి ఒక్క తెలియపర్చడం కోసమే సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పనుల్లో నిష్ణాతులను చేసి సమర్థవంతమైన సంస్థగా అభివృద్ధి చెందడం కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు ఇందారం ఓసీపీ ముఖ్యమైందని, ఉత్పత్తి సాధనలో ఇందారం గనిలో పనిచేసే ఉద్యోగులు తమ వంతు బాధ్యత వహిస్తున్నారన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ముం దుండాలన్నారు. ఉపరితల గనిలో క్వారీలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. భూగర్భంలో, ఉపరితల గనిలో యంత్రాల పని గంటలను పెంచాలని, ఉద్యోగుల హాజరు శాతాన్ని పెంచాలని, ఖర్చులు తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో మల్టీ డిపార్టుమెంటల్ సమావేశాల కన్వీనర్ ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజన్న, రామకృష్ణరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ప్రగతే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జీఎం విజయ్‌ప్రసాద్

మందమర్రిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సంస్థ ప్రగతే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులు అందరు కలిసి కట్టుగా పని చేయాలని మందమర్రి ఇన్‌చార్జీ జీఎం విజయ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం ఏరియాలోని కేకే ఓసీపీలో మల్టీ డిపార్టుమెం ట్ సమావేశం నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి యాజమా న్యం కృషి చేస్తుందన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాద రహిత ఉత్పత్తి చేయాల న్నారు. గనిలోని ప్రతి అంశంపై అధికారులు, కార్మికులు తెలుసుకుని ఉండాలన్నారు. అనుకున్న లక్ష్యం కంటే అదనపు ఉత్పత్తి సాధించాలని, ఇతర ఏరియాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందించారు. ఈ సమావేశంలో అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పిట్ కార్యదర్శి కుమారస్వామి, అధికా రులు బాలాజీ భగవతి, ప్రసాద్, శ్యాం సుందర్, కిరణ్‌కుమార్, మల్లయ్య, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్చ్‌ను ప్రారంభించిన జీఎం



ఆర్చ్‌ను ప్రారంభిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ ఓపెన్ కాస్టు ప్రాజెక్టు వద్ద ఉన్న శ్రీ కనకదుర్గదేవి ఆలయ 17వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు ఆర్చ్‌ను జీఎం విజయభాస్కర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ పీవో ఎం.నరేందర్, పీఈ వీర్న, మేనేజర్ శంకర్‌తో పాటు ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి తిరుపతి పాల్గొన్నారు.


డైరెక్టర్‌కు సన్మానం

జైపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావును సోమవారం ఎస్టీపీపీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు డైరెక్టర్‌ను శాలువాలతో సన్మానించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, మురళీధర్, మదన్‌మోహన్, శ్రీనివాస్, కిరణ్ బాబు, పంతుల నాయక్, వెంకటయ్య, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

చిత్రం.. పదిలం..



కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిసరాలు



మంచు తెరలో ఉదయిస్తున్న సూర్య కిరణాలు



ప్రకృతి అందాలు, పక్షులు, జంతువులు, శ్రామికులు, కాలానికి అనుగుణంగా వచ్చే మార్పులు.. ఆస్వాదించాలే కానీ అవన్నీ సుందర దృశ్యాలే... వేల పదాల్లో చెప్పలేని విషయాన్ని ఒక్క చిత్రంతో చెప్పొచ్చు.. ప్రతీ దృశ్యాన్ని బంధించి జ్ఞాపకాల గదిలో చూసినప్పుడల్లా పాత గుర్తులను నెమరు వేసుకొనే అవకాశం ఫొటోగ్రఫితో సొంతమవుతుంది. మంగళ వారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' బంధించిన చిత్రమాలిక..

- నస్పూర్/దండేపల్లి, ఆంధ్రజ్యోతి







కవ్వాల్ ఫారెస్టులో అందమైన అడవి మధ్యలో మైసమ్మ కుంట

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించా రు. ఈ సందర్భంగా నస్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సుందిళ్ల నరేందర్, సుందిళ్ల రాజమ్మ, సుందిల్ల సులోచనలు తమ కుటుంబ పెద్ద పేరిట నస్పూర్ శివారులోని భూమిని కొందరు అక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం సుబ్బారావుపల్లి గ్రామానికి చెందిన హనుమాండ్లు 50 సంవత్సరాలుగా తాను టేకుచెట్లు నాటి సంరక్షించానని, వాటిని తొలగించి వ్యవసాయ సాగు చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ మాజీ సర్పంచ్ మంద అనిత తమ గ్రామంలోని ఎర్రకుంట చెరువును కొందరు రియల్ ఎస్టేట్ వారు ఆక్రమించారని దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో మంచిర్యాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సూచించారు. సోమవారం భారీ వర్షానికి నీటిమయమైన హమాలీవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విషసర్పాలు కనిపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవావాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. బీఆర్ఎస్ నాయకులు, యువత ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, సీనియర్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, నరేష్, తిరుపతి, మల్లేష్, నాయకులు శంకర్, చరణ్ పాల్గొన్నారు.



హమాలీవాడలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి: రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని కోరుతూ ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

● కన్నాల గ్రామంలో ఎర్రగుంట చెరువులో రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు రైతుకార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు.

వేమనపల్లి: ఆదివాసీ విద్యార్థులకు విద్యను అందించడానికి జిల్లాలో గిరిజన గురుకుల కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి బెల్లంపల్లికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం అందించారు.

మంచిర్యాలక్రైం: పట్టణంలో భారీ వరదల వల్ల డ్రైనేజీ కూడుకపోవడంతో 5వ వార్డు మాజీకౌన్సిలర్ సుదమళ్ల హరిక్రిష్ణ ఎక్స్‌కవేటర్ ద్వారా వరద ఉధృతిని తొలగించేందుకు పనులు చేపట్టారు.

● హైటెక్ సిటీ కాలనీల్లో రోడ్లు జలమయం కావడంతో కాలనీని మున్సిపల్ కమిషనర్ సంపత్ పరిశీలించారు.

● మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు రజిత నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు.

లక్షెట్టిపేట: మండలంలో వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు.

● వర్షం కారణంగా పట్టణంలో ఇళ్లలోకి వరదనీరు చేరి ఇబ్బంది పడుతున్న బాధిత కుటుంబాలకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్ నిత్యావసర సరుకులను అందజేశారు.

ముంపు ముంగిట ఎంసీహెచ్

(5వ పేజీ తరువాయి..)

60ఫీట్ల రోడ్డులో వరద వల్ల జలమయ్యాయి. పలు వీధుల్లో కెనాల్ నిండి ఇళ్లలోకి వరద చేరింది. ముఖ్యంగా సూర్యనగర్ జలమయమైంది. ఎగువన ఉన్న దొరగారిపల్లె చెరువు, పోచమ్మ చెరువులు నిండి మత్తడి పారడంతో ఈ దుస్థితి నెలకొంది. గతంలో 10నుంచి 15 ఫీట్ల కెనాల్ ఉండగా గృహ నిర్మాణాలు చేపట్టి కెనాల్‌ను నాలుగు ఫీట్లకు కుదించడంతో వరద ముంపు ఎదురవుతున్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బృందవన్‌కాలనీ, సూర్యనగర్ చెరువు శిఖం భూములు, బఫర్‌జోన్‌లో ఉండడం వల్లనే ప్రతీ సంవత్సరం ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. మాతా శిశు ఆసుపత్రి వద్ద భారీ వర్షం వల్ల వరదనీరు చేరడంతో ఆసుపత్రికి వచ్చే సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వరద వల్ల ఆసుపత్రి ఆవరణలోకి పాములు రావడంతో పలువురు భయభ్రాంతులకు గురయ్యారు.

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంతో పాటు మండలంలో పలు కాలనీలకు వరద నీరు చేరింది. కాల్‌టెక్స్ ఏరియాల్లో, రైల్వే స్టేషన్ రోడ్డులో రోడ్డు పక్కన భారీగా వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే రాంనగర్ బ్రిడ్జి పై నుంచి వరదనీరు పోటెత్తడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఆర్టీసీ బస్టాండ్ నుంచి వరద నీరు మార్కెట్ సెంటర్‌లోకి వచ్చింది. దీంతో మార్కెట్ బురదమయంగా మారింది. ఎంటీబీసీ నుంచి కేకే 5 బంగ్లాస్ వరకు వరద నీరు రోడ్డుపై నుంచి ప్రవహించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని సీఈఆర్ క్లబ్ వద్ద గల పాలవాగు ఉప్పొంగి ప్రవహించింది. స్థానిక పాఠశాలలోకి వరద నీరు చేరింది. రైల్వేస్టేషన్ సమీపంలోని భాగ్యనగర్ కాలనీలోకి వరదనీరు చేరింది. స్థానిక రెండో జోన్‌లోని క్వార్టర్లలోకి వరద నీరు చేరింది. స్థానికులు మున్సిపల్ కమిషనర్ రాజలింగుకు సమాచారం అందించడంతో ఆయన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పాలవాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఊరు రామకృష్ణపూర్‌లోని పంట పొలాల్లో వరద నీరు చేరిం ది. కేకే5 గని వెనకాల గల పాలవాగు పొంగడంతో గని అధికారులు వరద ఉధృతిని పరిశీలించారు.

హాజీపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో రాపల్లి శివారులోని పంట పొలాలు నీటమునిగాయి. పందిళ్లు వేసిన బీర, కాకర తోటలు నేలకొరిగాయి. మూడు రోజులుగా కూరగాయల తోటల్లో నీరు నిలువడంతో తెగుళ్లబారినపడి పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఎడతెరపిలేకుడా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వరద నీరు చేరింది.

● కోతకు గురైన కల్వర్ట్

నస్పూర్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం కురిసిన వర్షంతో వినూత్న కాలనీ-శ్రీశ్రీనగర్ మధ్య గల తోళ్లవాగుపై ఉన్న కల్వర్టు కోతకు గురైంది. కాలనీల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీ వాసులు కలెక్టరేట్ సమీపం నుంచి తిరిగి రావాల్సివస్తోంది. సీతారాంపల్లి రోడ్డులో ఎగువ నుంచి వరద ఎక్కువ రావడంతో ఒర్రె కల్వర్టుపై వరద ప్రవహిస్తోంది. కాలనీలోని కల్వర్టు వద్ద వరద ప్రవాహంలో గేదె కొట్టుకునిపోయి కొద్దిదూరంలో దిగువ ఒడ్డుకు చేరింది.



రామకృష్ణాపూర్‌లో ఇళ్ల మధ్యలోకి చేరిన వర్షపు నీరు

కార్మికుల ఇళ్లలోకి వర్షపు నీరు

రామకృష్ణాపూర్(ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంకారణంగా రామకృష్ణాపూర్ లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రామాలయం, ఆర్‌కే1ఏ, మల్లీకార్జున నగర్, భగత్‌సింగ్‌నగర్, శాంతినగర్ ఏరియాలు వరద నీటితో నిండిపోయాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇళ్ల నుంచి ఎవరు బయటకు రావద్దని క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ గాదె రాజు కోరారు. ఆర్‌కే1ఏ వద్ద వరద నీరు చేరడంతో కార్మికులు విధులకు హాజరయ్యే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని జీఎం దేవందర్ సూచించారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు, పట్టణ బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాళాల వద్ద రక్షణ చర్యలు చేపట్టారు.





మందమర్రిలో పొలాల్లోకి చేరిన వరద నీరు, సహాయక చర్యలు చేపడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజలింగం

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తలు పాటించాలని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పొలాల్లో మోటార్లు వేసేటప్పుడు తడి చేతులతో విద్యుత్ తీగలను లేదా స్విచ్‌లను తాకవద్దని తడిగా ఉన్న విద్యుత్‌స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాలను ముట్టుకోవద్దని సూచించారు. ఎక్కడైన చెట్లు విరిగి కరెంటు తీగలు తెగి పడి ఉంటేవాటిని తాకవద్దని తెగిపడిన తీగలు లేదా పరికరాలు కనిపిస్తే 1912కి కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న బుధవారం వినాయక చవితి పండగ సందర్భంగా మంచిర్యాల జోన్‌లో మండపాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు జరుపుకునేవారు తప్పనిసరిగా పోలీసుశాక నుంచి అనుమతి పొందాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా విగ్రహాలకు సంబంధించి సమాచారం అందించాలని సూచించారు.

బోధనోపకరణాలు ఉపయోగించుకోవాలి



జన్నారంలో జరిగిన మేళాలో పరికరం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

భీమిని, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని తరగతి గదుల్లో విద్యార్థులకు బోధనోపకరనాలు ఉపయోగించి బోధించాలని మండల విద్యాధికారి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్(ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరాసి) కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు విధిగా పాఠ్య ప్రణాళిక సిద్ధం చేసుకొని బోధనోపకరణాలు తయారు చేసుకొని బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ బికర్ణదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం: మండల స్థాయి టీఎల్ఎం మేళా స్థానిక బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పరికరాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, రాజన్న, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మంత్రి రాజు, చిన్న నరసయ్య, సుదర్శన్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటిలో మునిగిన పంటల పరిశీలన

తాండూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో నీట మునిగిన పంటలను మండల వ్యవసాయాధికారి సుష్మ సోమవారం పరిశీలించారు. రేచిని, చౌటపల్లి, తాండూర్ గ్రామాల్లోని నీటి మునిగిన పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు శంకర్, వెంకటేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పత్తి పంటలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి

కాసిపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సోమవారం కనికలపూర్‌లోని పత్తి రైతులకు ఏఈవో శ్రీధర్ అవగాహన కల్పించారు. పత్తిచేనల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా కాల్వలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నీరు పత్తి చేన్లలో నీరు అధికంగా నిల్వడం వల్ల నీరు కుళ్ల తెగులు సోకి చెట్లు చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 గేట్లు ఎత్తివేత



నిండుకుండలా మారిన నస్పూర్ చెరువు

హాజీపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గుడిపేట వద్ద గల శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం ప్రాజెక్టులోని 62గేట్లలో 32 గేట్లను ఎత్తి దిగువ గోదావరికి నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి లక్ష క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వస్తుంది. గేట్ల ద్వారా రెండు లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రాజెక్టులో ప్రస్తుతం 18టీఎంసీల నీటి నిలువ ఉంది.

ఎల్లంపల్లికి సందర్శకుల తాకిడి...

ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి ఎక్కువ అయింది. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో ప్రాజెక్టును చూడడానికి సందర్శకులు పోటెత్తారు. పోలీసులు భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నస్పూర్ చెరువుకు జలకళ

నస్పూర్: నస్పూర్ పెద్ద చెరువు కురుస్తున్న వర్షాలకు పూర్తి స్థాయి నీటి మట్టంకు చేరి జలకళను సంతరించుకుంది. వర్షాలు కురుస్తుండటం ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చెరువులోకి చేరి మత్తడి ద్వారా దిగువకు వెళ్తోంది. దిగువన పొలాల నుంచి ఒర్రెల నుంచి గోదావరి నదిలో కలుస్తుంది. అయితే ఇదేమార్గంలో గోదావరి రోడ్డులో చెరువు మత్తడి వరద ప్రవహిస్తుంది. దీంతో నదివైపు రాకపోకలు నిలిచిపోయాయి.

నిండిన ఇటిక్యాల చెరువు

లక్షెట్టిపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాల చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. ఇటీవల చెరువు పూడిక తీత పనుల నేపథ్యంలో ఒక కాంట్రాక్టర్ చెరువులోని మట్టిని తీసి అదే చెరువు పరిసరాల్లో పోశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులోకి వరదనీరు చేరడంతో చెరువు పరిసరాల్లో పోసిన మట్టి కుప్పలు కూడా చెరువులో కలిసి పోతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని చెరువు పరిరక్షణ కమిటీసభ్యులు కోరారు.

వాగులపై వంతెనలు లేక ప్రజల ఇక్కట్లు

మందమర్రిరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలోని అందుగులపేట, శంకర్‌పల్లి గ్రామాల్లో వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అందుగులపేటలోని పెద్దవాగు (రాళ్లవాగు) ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామంలోని 90 శాతం మంది రైతుల పొలాలు వాగు అవతలి వైపు ఉండడంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సి ఉంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం సోలార్ ప్లాంట్ యాజమా న్యం వారి అవసరాల కోసం వాగుపై లోలెవెల్ వంతెన నిర్మించారు. వర్షాలకు వాగు వరద ఉధృతికి నాలుగు సంవత్సరాల క్రితం వంతెన కూలిపోయింది. దీంతో గ్రామస్థులు, రైతులు వెళ్లేందుకు పైపులతో తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేశారు. ఇది కూడా వర్షాలకు మునిగిపోవడంతో రైతులు, ప్రజలు వాగు దాటి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాగులపై వంతెనలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



అందుగులపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

రేషన్ షాపులను ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపెల్లి, లేమూరు, శంకర్‌పల్లి గ్రామంలో రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సంఘ సేవకుడు వంజరి వెంకటేష్ వినతిపత్రం అందించారు. గ్రామాల్లో రేషన్ షాపులు లేకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జైపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జైపూర్ గ్రామ సంఘం స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వెన్నెల గ్రూప్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులు సోమవారం తహసీల్దార్ వనజారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు మద్దుల సునీత, ప్రధాన కార్యదర్శి జ్యోష్న, కోశాధికారి దీపిక మాట్లాడుతూ గతంలో మహిళల సమావేశాల కోసం అప్పటి ఎమ్మెల్యే ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాలతో గతంలో పనిచేసిన తహసీల్దార్ గ్రామ సంఘానికి స్థలం కేటాయించారని, ఇప్పుడు స్థానికేతరులు దాన్ని ఆక్రమించి అమ్మకానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంత్రి వివేక్‌వెంకటస్వామి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

జిల్లా వ్యాప్తంగా బహుజన యుద్ధ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను గౌడ సంఘం, మోకుదెబ్బ, బహుజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

జన్నారం ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వేడుకల్లో మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలసాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మూల భాస్కర్‌గౌడ్, నర్సాగౌడ్, సతీష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండలంలోని రెబ్బెన గ్రామంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు రాజగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మహేష్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండి రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల రవిగౌడ్, కోశాధికారి బొమ్మగోని రమేష్, దండేపల్లి పట్టణ అధ్యక్షులు తాళ్ల కుమార్‌స్వామిగౌడ్ పాల్గొన్నారు.

కాసిపేట: కొండాపూర్ యాప వద్ద జరిగిన వేడుకల్లో మోకు దెబ్బ మండల సలహాదారు పల్లె మల్లయ్య నాయకులు నీరెల్లి బుగ్గయ్య, కోడూరి గురువయ్య కొడేటి రాజగౌడ్, పడాల మల్లేశ్ పాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు తొలుపునూరి సుదర్శన్‌గౌడ్, ముత్యం సత్యగౌడ్, అరిగెల శంకర్ గౌడ్, ముత్యాల రాజేశ్వర్ గౌడ్, ముత్యాల మల్లగౌడ్, బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.



కొండాపూర్‌యాపలో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

భీమారం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పున్నం గౌడ్, వెంకటేశ్వర్లు, సత్యం, కుమార్, ప్రణీత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేముల ఉపేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మడిపెల్లి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వాగులపై వంతెన నిర్మించాలని రిలే దీక్ష

తాండూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ పంచాయతీలోని చెక్‌పోస్టు వద్ద ఉన్న వాగుపై, భీమన్న వాగులపై హైలెవెల్ వంతెనలు నిర్మించాలని తుడుందెబ్బ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాగులపై వంతెనలు లేక వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అత్యవసరం అయితే వాగులు దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. వెంటనే వాగులపై వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ దీక్షలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి సంఘీభావం ప్రకటించారు. నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
8
మంగళవారం 19 ఆగస్టు 2025

- ఉత్సవాలకు వినాయక విగ్రహాలు సిద్ధం
- ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చిన మండపాల నిర్వాహకులు
- అధిక ధరలతో భక్తుల బెంబేలు
- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ కేంద్రాలుగా విగ్రహాల తయారీ
- జిల్లా వ్యాప్తంగా 12 కోట్లపైనే ఉత్సవాలకు ఖర్చు
- ఈ నెల 27న వినాయక చవితి



కాగజ్‌నగలో అమ్మకానికి సిద్ధం చేసిన గణనాథుడి విగ్రహం

లంబోధరా'.. కొలిచేదెలా..

ముడిసరుకుల ధరలు పెరుగడంతో ఆ ప్రభావం గణనాథుల విగ్రహాల తయారీపై పడింది. గతేడాదితో పోల్చితే 10 నుంచి 15 శాతం ధరలు పెరిగాయని చెబుతున్నారు.

చింతలమానేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గణనాథుల ఉత్సవాలకు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో భక్తులు సిద్ధమయ్యారు. ముడిసరుకులు, కూలీ రేట్లు, రంగుల ధరల పెరుగు దలతో ఈ సారి కూడా లంబోదరుడి ధరలు భారీగా పెరిగాయి. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ కేంద్రంగా తయారైన విగ్రహాలు జిల్లాలోని ఆయా మండలాల్లోని వివిధ గ్రామాలకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ నెల 27న వినాయక చవితి ఉండడంతో విగ్రహాల కొనుగోళ్లపై నిర్వాహకులు దృష్టి సారించారు. విగ్రహాలకు ఇప్పటికే తమకు ఇష్టమైన ఆకృతి, ఎత్తులో ఉన్న విగ్రహాలను కొనుగోళ్లు చేసేందుకు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ జిల్లాల్లో తయారు చేస్తున్న కేంద్రాల వద్దకు వెళ్లి విగ్రహాలను ముందస్తుగానే కొంత నగదును అడ్వాన్సును ఇచ్చి బుకింగ్ చేసుకుంటున్నారు. అయితే గణనాథుల విగ్రహాల ధరలతో పాటు రవాణా చార్జీలు నిర్వాహకులకు భారంగా మారుతున్నాయి. ఈ సారి 6 పీట్ల విగ్రహానికి 12వేలు, 7పీట్ల విగ్రహానికి రూ. 15 వేలు, 10పీట్ల విగ్రహానికి రూ. 18 వేల నుంచి 20 వేల వరకు అమ్ముతున్నారు. 14 నుంచి 15 పీట్ల విగ్రహాలు రూ. 40వేల నుంచి రూ. 45వేల వరకు ఉండగా విభిన్న ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భారీగా ఉన్న విగ్రహాలకు లక్షల్లో ధరలు పలుకుతున్నాయి.

● పలు రకాల ఆకృతులు..

బొజ్జ గణపయ్యకు ఎన్నెన్నో రూపాలు ఇచ్చి కొలుస్తుంటారు. ఏ దేవుడికి లేనన్ని ఆకృతులను ఏకదంతుడికి అందిస్తాం. ఎంతో సంతోషాన్ని కలిగించే పండగల్లో తొమ్మిది రోజుల పాటు జరుపుకునే వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాల వైపు కూడా ఆసక్తి చూపుతున్నారు. ముడిసరు కుల ధరలు పెరుగడంతో ఆ ప్రభావం గణనాథుల విగ్రయాల తయారీపై ప డింది. జిల్లా వ్యాప్తంగా 12 కోట్లపైనే ఉత్సవాలకు ఖర్చు చేయనున్నారు. వినాయక చవితి పండగ ఒక సాంప్రదాయమైతే.. నిమజ్జనం వయోబేధం లేకుండా ఒక సంబురంగా ఉంటుంది. నిమజ్జనం చేసే విగ్రహాలు పాస్టర్ ఆప్ ప్యారిస్‌తో పాటు రసాయన రంగుల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా హాని కల్గిస్తాయని ప్రభు త్వం పర్యావరణ పరిరక్షణ పేరుతో చేస్తున్న ప్రచా రానికి ప్రజల్లో మార్పు వచ్చింది. ప్రభుత్వ విభా గాలు, స్వచ్ఛంధ సం స్థలు ఉచితంగా మట్టి వినాయ కులను ప్రజలకు అందిస్తున్నారు. దీంతో ఇళ్లల్లో సైతం మట్టితో చేసినవి వాడుతున్నారు.

● గుజరాత్, ఛత్తీస్‌గఢ్ నుంచి..

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల తదితర ప్రాంతాలకు గుజరాత్, రాజస్థాన్, చత్తీస్గఢ్ వంటి రాష్ట్రాల నుంచి కళాకారులను తెప్పించి విగ్రహాలను తయారు చేయిస్తున్నారు. వినాయక విగ్రహాలను ఉత్సవాల కోసం ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వస్తుంటారు. దీంతో ఇక్కడ వారికి ఉపాధి లభిస్తుంది. తమ హస్తకళా నైపుణ్యంతో రకరకాల రూపంతో సుందరాకృతులను ఆకర్షణీయంగా తయారు చేస్తు న్నారు. పల్లెల్లో, పట్టణాల్లో పందిళ్లు, షెడ్లు వేసి వినా యక విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని సామూహికంగా భక్తి భావంతో పూజలు జరుపుతారు. వినాయక చవితికి మూడు నెలల ముందే ఇతర రాష్ట్రాల నుం చి కళా కారులు జిల్లాకు చేరుకొని విగ్రహాలను తయా రు చేస్తున్నారు. ఈ కళాకారులు ప్రతిమలను తయా రు చేయడమే తమ జీవనాధారమని చెబుతున్నారు. దుంప పిండి, పేపర్ పౌడర్, వైట్ ప్లాస్టర్‌తో వినా యక విగ్రహాల తయారీని చేస్తున్నామని చెబుతున్నా రు. మూడు మిశ్రమాలను కలుపుకొని ఈ పిండిని రబ్బరు లాగా తయారు చేసుకొని వాటితోనే వినాయక విగ్రహాల విడిభాగాలు తయారు అవుతాయని కళాకారులు చెబుతున్నారు. ప్రస్తుతం విగ్రహాల తయారీకి ఉపయోగించే పాస్టర్ ఆఫ్ ప్యారిస్, గమ్, కొబ్బరి పీ చు ధరలు పెరిగి పోయాయని చెబుతున్నారు.

సైజు ఆధారంగా ధర..

- రౌతు అంజన్న, వినాయక మండపం నిర్వాహకుడు



వినాయక విగ్రహాల ధరలు పీట్ల సైజు, వాటి విభిన్న ఆకృతులను బట్టి ధరలు ఉన్నాయి. 6 పీట్ల వినాయక విగ్రహానికే ధర రూ.12 వేల వరకు చెబుతున్నారు. ఇప్పటికే ఆర్డర్ ఇచ్చి వినాయక విగ్రహాన్ని బుక్ చేశాం. ఏటా ఏడాది వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం. ఖర్చులు పెరిగి నప్పటికీ భక్తి భావంతో ప్రతిష్ఠిస్తాం.

యువత చూపు బీజేపీ వైపు



కండువాలు వేస్తున్న బీజేపీ నాయకుడు నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేపడుతున్న ప్రజా సంక్షేమ అభివృద్ధికి యువత ఆకర్షితులై బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నాని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కంచుకోటకు చెందిన యువత మాజీ వార్డు సభ్యుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. అరిగెల వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాగమణి, సురేష్, మహేష్, సాయి, కిరణ్, నాగేష్, రామగౌడ్, శ్రీకాంత్, సంతోష్, పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంట గ్రామంలో సోమవారం వేదపండితులు మనోహర శర్మ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి సోమవారం అభయాంజనేయ స్వామి, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ పూజల్లో బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ప్రముఖ వ్యాపారవేత్త ఉమే ష్ యాదవ్, సావిత్రి, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ దంపతులు, అరిగెల వేణు దంపతులు, శరత్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శ్యామ్‌నాయక్, శ్రీశైలం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందజేయాలి

దహెగాం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఇళ్లు కూలినా, పాక్షికంగా దెబ్బతిన్న వారికి పరిహారం వెంటనే అందించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. హత్తిని గ్రామంలో కూలిన ఇళ్లను సోమవారం పరిశీలించారు. దహెగాం మండలంలో నలుగురి ఇళ్లు కూలి పోయానని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా వారదరికి బిల్లులు మంజూరు చేసి పరిహారం అందించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, రాజేందర్ ఉన్నారు.

రైతులకు చేయూతనివ్వాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు రైతులకు చేయూతనివ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, పోలీసు, వ్యవసాయ సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో యూరియా నిలువల సరఫరా, ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్ భవనం వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ సుభాష్, అదనపు కలెక్టర్ డేవిడ్‌లతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 1,300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. వారం రోజుల వరకు సరిపడ ఉన్న యూరియాను ప్రాధా న్యం ప్రకారం రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార శాఖ అధికారి బిక్కు, మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్న నరహరిపై అక్రమ కేసు పెట్టిన పోలీసు అధికారు లపై చర్యలు తీసుకొని న్యాయవాదికి న్యాయం చేయాలని బార్ అసో సియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్‌తో పాటు మాజీ అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావే శంలో మాట్లాడుతూ ఈ నెల 6న న్యాయవాదిపై జరిగిన దాడికి చర్య లు తీసుకోకపోవడంతో గత శుక్రవారంవరకు విధులు బహిష్కరించామని చెప్పారు. జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావే శంలో పి.సురేష్, ఎంసురేష్, సతీష్‌బాబు, శ్రీనివాసరావు, శ్యాంకుమార్, రాజీవ్‌రెడ్డి, చరణ్‌తేజ, గణేష్, గణపతి, ఆకాష్, విద్యాసాగర్, నాగేష్, లాల్సా, ప్రత్యూష, అనిత పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ్



ధనుంజయ్

దహెగాం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన రాపర్తి ధనుంజయ్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే హరీష్‌బాబుతో పాటు కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోడు రైతుల సమస్యపై స్పష్టత కరువు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పోడు రైతుల సమస్యపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైందని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. పోడు రైతుల సమస్యను పరిష్కరించాలని, జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలన్న ప్రధాన డిమాండుతో హరీష్‌బాబు సోమవారం తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల విషయంలో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జీవో 49 కేవలం తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకు ఈ నిరవధిక నిరహార దీక్ష కొనసాగిస్తామని ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేయటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోడు రైతుల సమస్య పరిష్కరించాలని హరీష్ బాబు కాగజ్‌నగర్ అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం చేపట్టగా, సోమవారం ఉదయం ఐదు గంటలకు పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేశారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, నాయకులను కెరమెరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరి పాటు ముట్టడికి విచ్చేస్తున్న నాయకులు, కార్యకర్తలను కాగజ్‌నగర్ డివిజన్ పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేసి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సొంత పూచికత్తుపై విడిచి పెట్టారు. అలాగే ఎమ్మెల్యే నివాసం వద్ద పోలీసులు రెండంచల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, నాయకులను లోనికి పంపించలేదు.

భారీ బందోబస్తు..

ఎమ్మెల్యే హరీష్ బాబు సోమవారం అటవీ శాఖ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనుండటంతో కాగజ్‌నగర్ డివిజన్ పోలీసులు అటవీ శాఖ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ కార్యాలయానికి పర్లాంగు దూరంలో పోలీసులు క్యాంపు ఏర్పాటు చేశారు.

పోడు రైతులకు అన్యాయం చేయం

చింతలమానేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం కర్జెల్లి రేంజ్ పరిధిలోని దిందా, బండలేటి గ్రామంలోని పోడు రైతులకు అన్యాయం చేయమని కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇచ్చేందుకు తాము సిద్దంగా ఉన్నామని కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ బొబాడే అన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో కర్జెల్లి రేంజ్ పరిధిలోని రైతులు, స్థానిక నాయకులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. పోడు వ్యవసాయం పేరిట అడవులు పెద్ద మొత్తంలో నరికివేతకు గురయ్యాయని ఈ క్రమంలోని అటవీ భూమిని స్వాధీన పర్చుకునేందుకు మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఇప్పటికే తమ భూమి పరిధిలో ట్రెంచ్ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. దిందా గ్రామ పోడు రైతులు ఏళ్ల నుంచి ఆ భూమిపై ఆధార పడి జీవనం సాగిస్తున్న క్రమంలో కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రైతులు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ కుటుంబానికి నాలుగు ఎకరాల వరకు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిడాం గణపతి, నానయ్య, ఎఫ్‌ఆర్వో సుభాష్, సీఐ సంతోష్ పాల్గొన్నారు.

23 నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

కాగజ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్టు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా సోమవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి తిరుపతి, చీఫ్ ప్యాట్రన్ ఆర్.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాస్కర్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాంబశివరావు పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యపై ప్రభుత్వానికి స్పష్టత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కౌటాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పోడు రైతుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఉందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పోడు రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు కూడా అవకాశం ఇచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరికి నాలుగు నుంచి ఐదు ఎకరాలిచ్చేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ విషయంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా అటవీ శాఖ అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. న్యాయపరంగా గిరిజనేతరులు ఆర్‌ఓఎఫ్‌ఆర్వో చట్టం ప్రకారం గిరిజనేతరులకు పోడు అవకాశం ఉండదన్నారు. వీరికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు దిందా గ్రామంలో అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికివేస్తున్నారని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడారని గుర్తు చేశారు. ఈ విషయంలో అధికారులు విచారణ జరిపితే ఈ ప్రాంతంలోనే గిరిజనేతరులు పోడు చేస్తున్నట్టు తేలిందన్నారు. పోడు సమస్యపై ఎమ్మెల్యే తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. గిరిజనేతరులకు పోడు పట్టాలిచ్చే అంశం కేంద్రం పరిధిలో ఉన్నదని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఉమ్మడి జిల్లాలో ఉండగా, ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో తాము బీజేపీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ జడ్పీచైర్మన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన టీఎల్ఎం మేళా

బెజ్జూరు/కౌటాల/చింతలమానేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన టీఎల్ఎం మేళా అలరించింది. ప్రాథమిక స్థాయిలో నిర్వహించిన మేళాను మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని ప్రజెంటేషన్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత ఉపాధ్యాయులు సత్తన్న, శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కౌటాల, మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళా అలరించింది. ఎంఈవో హనుమంతు ఉపాధ్యాయులు ప్రకాష్, దేవన్న, లాలాజీ, సుమన్, బాలాజీ పాల్గొన్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ఉపాధ్యాయులు పాల్గొని ప్రజెంటేషన్ అంద జేశారు. కార్యక్రమంలో ఎంఈవో జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం



కుమరంభీం ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తిన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ఉదయం నుంచి వర్షం కురిసింది. ఆసిఫాబాద్ మండలంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువన కురుస్తున్న బారీ వర్షాలకు పెద్దవాగు, గూడెన్‌ఘాట్ వాగులు ఉప్పొంగి ప్రవహిసున్నాయి. మండలంలో, ఎగువన కురుస్తున్న వర్షాలకు కుమరంభీం ప్రాజక్టులోకి 52, 220 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో అరు గేట్లు పైకి ఎత్తి 51,667 క్యూసెక్కుల వరదనీటిని అదికారులు కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టులోకి 3,600 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి 3,250 క్యూసెక్కుల వరదనీ టిని అదికారులు కిందికి వదులుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 5.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) సరిహద్దున ప్రవహిస్తున్న పెన్‌గంగా సోమవా రం ఉప్పొంగి ప్రవహించింది. హుడ్కిలి వంతెనతో పాటు వెంకట్రావుపేట-పోడ్సా వంతెనకు ఆనుకుని ప్రవహించడంతో మహారాష్ట్రకు రాక పోకలు నిలిపివేశారు. వరద ప్రాంతాలను తహసీల్దార్ రహీముద్దీన్, డీఎల్‌పీవో ఉమర్ అహ్మద్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై కమలాకర్‌లతో పాటు రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎవరు కూడా వంతెన దాట వద్దని సిబ్బందికి సూచించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, రహదారులు వరద నీటితో చెరువులు, కుంటలను తలపించాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ రోడ్డులో భారీగా వరద నీరు నిలిచి వాహనాలు నీట మునిగాయి. వరదనీరు కిరాణ, ఇతర దుకాణాల్లో చేరడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్ కాలనీల్లో ను వరద నీరు ఇళ్లల్లో చేరడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజీజోద్దిన్, కార్యదర్శి శివ వరద నీటిని తొలగించేందుకు సహాయక చర్యలు చేపట్టారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలైన మార్కెట్ ఏరియా, సంజీవయ్యకాలనీ, శ్రీరాంనగర్ కాలనీల్లో వరదనీరు చేరింది. కాగజ్‌నగర్ పెద్దవాగులో నీటి ప్రవాహం అధికమైంది. తహసీల్దార్ మధుకర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమ వారం ఉదయం నుంయి ఎడ తెరపి లేకుండా వర్షం కురిసింది. లేండిగూడ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ప్రజలు మండల కేంద్రానికి రాలేని పరిస్థితి నెలకొంది. లేండిగూడ వాగు వరదను తహసీల్దార్ ఆడ బీర్షావ్ పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది భరత్ తదితరులు ఉన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. ఉదయం వర్షం లేకపోవడంతో చేను పనుల నిమిత్తం రైతులు వ్యవసాయ కూలీలు చేనులకు వెళ్లి తిరిగి వచ్చారు. ఆ సమయంలో కేతిని- దిందా వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయినా దిందా గ్రామస్తులు ప్రమాదకరంగానే వాగును దాటారు. ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పని పరిస్థితుల్లో వాగు దాటారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి రోడ్లు సైతం బురద మయంగా మారి ప్రజలకు అసౌకర్యంగా మారాయి.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం రెండు గంటలపాటు భారీ వర్షం పడింది. దీంతో వాగులు, ఒర్రెలు పొంగి ప్రవహించాయి..సిర్పూర్(యు), దేవుడుపల్లి లోలేవల్ వంతెన, కోడ్డిగూడ, పాముఇవాడ కల్వర్టు, శేట్టిహడ్ప్నూర్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రజలు వాగులు దాటవద్దని అధికారులు సూచించారు.



చెరువును తలపిస్తున్న వాంకిడి మార్కెట్ రోడ్డు



సిర్పూర్(టి)లో హుడ్కిలి వంతెన వద్ద పరిశీలిస్తున్న అధికారులు



కాగజ్‌నగర్ శ్రీరాంనగర్ కాలనీలో నిలిచిన వరదనీరు